

ప్రాణంపై 'పొగ' ఎందుకు?
ధూమపానం కారణంగా గుండెపోటు, కేన్సర్, వంటి ప్రాణాంతక వ్యాధులు బారిన పడిన వారి సంఖ్య జిల్లాలో రోజురోజుకు పెరుగుతోంది.
- 10లో



పైడితల్లికి పుష్పాలంకరణ
ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలను తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.
- 10లో



జగన్ అంటే నమ్మకం.. చంద్రబాబు ఒక అబద్ధం
జగన్ అంటే ప్రజల్లో ఓ నమ్మకం, మాట ఇస్తే ఆచరణలో పెడతారు.. చంద్రబాబులా అబద్ధాలు చెప్పరని జెడ్పీ చైర్మన్ పేర్కొన్నారు.
10లో

న్యూస్‌రీల్

గ్రంథాలయానికి 100 కుర్చీల వితరణ



కుర్చీలను అందజేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లలిత

విజయనగరం అర్బన్: గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయానికి పట్టణంలోని ఎస్వీఎస్ నగర్ జ్ఞాన సరస్వతి ఆలయ కమిటీ 100 కుర్చీలను సమకూర్చింది. గ్రంథాలయ ప్రాంగణంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి, కార్యదర్శి ఎన్.లలితకు కమిటీ సభ్యులు కుర్చీలను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఉప గ్రంథాలయ అధికారి బి.లక్ష్మి, ఎస్వీనగర్ కార్యదర్శి జి.శ్రీనివాస్, ట్రెజరర్ ఎ.శివరామకృష్ణ, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిల్లాకు మంత్రి బొత్స రాక

విజయనగరం అర్బన్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విజయనగరం జిల్లాకు బుధవారం రానున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కాకినాడలో బయలుదేరి సాయంత్రానికి నగరంలోని తన నివాసానికి చేరుకుంటారని మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

సైనిక పాఠశాలలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న పాఠశాల సిబ్బంది, కేడెట్లు

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక పాఠశాలలో ఏటీసీ-4 ఎన్‌సీసీ శిబిరంలో భాగంగా మూడో రోజు మంగళవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో 20 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో క్యాంపు కమాండెంట్, కల్నల్ ఎ.కె.నౌటియల్, డిప్యూటీ క్యాంపు కమాండెంట్, కెప్టెన్ ఎం.సత్యవేణి, సుబేదార్లు మేజర్ రామ్‌దత్, డీఎస్ బౌడేల్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి ఎం.రాము, సిబ్బంది, పీఐ సిబ్బంది, 500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

హోమ్‌గార్డుకు ఆత్మీయ వీడ్కోలు



ఎల్లమ్మను సత్కరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం టౌన్: జిల్లా పోలీస్ శాఖ హోమ్‌గార్డు విభాగంలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన సుంకరి ఎల్లమ్మకు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఎస్పీ ఎం.దీపిక ఆమెను దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో విజయనగరం సబ్‌జైల్, ఎస్.కోట సబ్ జైల్‌లో డిప్యూటేషన్‌పై పనిచేసిన ఎల్లమ్మ ఎంతో క్రమశిక్షణ, అంకిత భావంతో 16 ఏళ్ల పనిచేశారన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ అస్మాఫర్హీన్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, కార్యాలయ పర్యవేక్షకుడు ప్రభాకరరావు, హోమ్‌గార్డు ఇన్‌చార్జి ఆర్ఎస్ఐ కేశవరావు, హెచ్‌సీలు శ్రీనివాసరావు, రాజు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కాన్ఫరెన్స్‌కు వేణుగోపాల్



పి.వేణుగోపాల్

రాజాం సిటీ: రాజాం మండలం కంచరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న పండూరు వేణుగోపాల్ జాతీయస్థాయి కాన్ఫరెన్స్‌కు ఎంపికయ్యారు. గ్లోబల్ ఇండియన్ యంగ్ సైంటిస్టు, టెక్నోక్రాట్స్ ఫోరం, విజ్ఞానభారతి ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి జూన్ 2 వరకు న్యూఢిల్లీలో నిర్వహించనున్న కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొననున్నారు. గతంలో ఆయన తయారుచేసిన ఆహారక్రాంతి, రోగనిరోధక శక్తి అనే విభాగంలో 'ఇంటి వద్దే తయారుచేయగల చిరుధాన్యాల పొడి' అనే ప్రాజెక్టు పోస్టర్ ప్రజెంటేషన్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ జాతీయస్థాయి కార్యక్రమంలో ఆరోగ్యవంతమైన, తాజా చిరుధాన్యాల పొడి ఎలా తయారు చేయాలో, అందులో ఉండే పోషక విలువలు, ఉపయోగాలను 15 నిమిషాలపాటు వివరించే అవకాశం వచ్చినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఆయనకు హెచ్ఎం ఎం.వి.సాయీశ్వరి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

4 ఏళ్ల సంక్షేమ సంబరం

- జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తి
- ఉమ్మడి విజయనగరం జిల్లాలో వేడుకలు నిర్వహించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- ఎస్.కోట నియోజకవర్గంలో 40 కి.మీ మేర బైక్ ర్యాలీ
- చీపురుపల్లిలో జరిగిన సంబరాల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సాక్షిప్రతినిధి, విజయనగరం:

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు మంగళవారం సంబరాలు జరుపుకున్నాయి. సంక్షేమ, అభివృద్ధి పాలనను వివరిస్తూ ఎస్.కోట, బొబ్బిలి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీలు నిర్వహించగా... మిగిలిన నియెజకవర్గాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చీపురుపల్లిలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు మరింత విశ్వాసం పెరిగిందన్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98.5 శాతం హామీలు అమలు చేశారని స్పష్టం చేశారు. నాలుగేళ్లలో 40 ఏళ్ల అభివృద్ధి చేసి చూపించారన్నారు. చంద్రబాబును ప్రజలు విశ్వసించడం లేదన్నారు. బొబ్బిలిలో ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ గత మేనిఫెస్టోలో 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు అందులో ఆరు హామీలైనా పూర్తిగా అమలు చేయలేదన్నారు. ముఖ్యమంత్రిగా తన పదవీ కాలాన్ని ఇంకా పూర్తి చేయకుండానే జగన్‌మోహన్‌రెడ్డి హామీలన్నింటినీ అమలు చేసి చూపించారన్నారు. గజపతినగరంలో ఎమ్మెల్యే అప్పలనర్సయ్య మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని ఎదుర్కొనే శక్తి ఏ పార్టీకి లేదన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని పొత్తులు పెట్టుకున్నా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేవని ధీమా వ్యక్తం చేశారు.

ఎస్.కోటలో హోరెత్తిన జగన్నినాదం

ఎస్.కోట నియోజకవర్గంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 3000 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా 'జయహో జగన్.. జై జగనన్న' అంటూ పార్టీ శ్రేణులు నినదించాయి. పేదల ఇళ్లస్థలాలపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ నియోజకవర్గంలో నాలుగు మండలాల మీదుగా సుమారు 40కి.మీ మేర ఎమ్మెల్యే శ్రీనివాసరావు పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీ చేశారు. కొత్తవలస నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ జామి, వేపాడ, ఎల్.కోట, ఎస్.కోట మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో అట్టహాసంగా, వేడుకలా ర్యాలీ ప్రారంభమై గోల్డ్‌స్టార్, ఎల్.కోట, సోంపురం, బొద్దాం, కొత్తూరు గ్రామాల మీదుగా ఎస్.కోట చేరింది. ఎస్.కోట పట్టణంలో ఆర్టీసీ కాంప్లెక్స్, దేవీ జంక్షన్, గాంధీ జంక్షన్, వన్‌వే, పురసకారి జంక్షన్, పోలీస్‌స్టేషన్ల మీదుగా ఎస్.కోట దేవీ జంక్షన్‌కు చేరింది. ర్యాలీ ఆద్యంతం మండే ఎండను లెక్కచేయకుండా ఉరిమే ఉత్సాహంతో సాగింది. అనంతరం ఎస్.కోటలోని దేవీ కూడలిలో దివంగత మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, డీసీసీబీ చైర్మన్ వి.చినరామునాయుడు పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన సంక్షేమానికి కేరాఫ్‌గా నిలిచిందని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు కొనియాడారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పూసపాటిరేగ మండలం నడిపల్లి గ్రామంలో పేదలకు ఎమ్మెల్యే చేతులమీదుగా మంగళవారం చీరలు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి నాయకులు,కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు అంధవరపు సూరిబాబు, మండల శాఖ అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



విశాఖ-అరకు రోడ్డులో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సాగుతున్న భారీ బైక్‌ర్యాలీ



పూసపాటిరేగ మండలం నడిపల్లిలో నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పేదల్లో ఆర్థికోన్నతి

రాజాంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కంబాల జోగులు ఆధ్వర్యంలో జగనన్న సంతకానికి నాలుగేళ్ల కార్యక్రమం నిర్వహించా రు. తొలుత కేక్ కట్ చేసి జై జగన్ అంటూ నినదించారు. మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ నాలుగేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో పేదల్లో ఆర్థికోన్నతి స్పష్టంగా కనిపిస్తొందన్నారు. రాజాం నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. రేగిడి మండల కేంద్రంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చింనాయు డు, పి.జగన్మోహన్‌రావుల ఆధ్వర్యంలో జగనన్న సంతకానికి నాలుగేళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు.



రాజాంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రోగులకు పండ్లు పంపిణీ

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరంలో పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నాయి. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో కేకును కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమి భయంతోనే చంద్రబాబు పొత్తులు కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, నాలుగు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయనగరంలో...

వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గం ఆధ్వర్యంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో జరిగిన కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, సీనియర్ సిటిజన్ విభాగం నాయకులు కె.కష్ణరావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఎస్.బంగారునాయుడు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో వివిధ డివిజన్‌ల కార్పొరేటర్‌లు, డివిజన్ ఇన్‌చార్జిలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బొబ్బిలి పట్టణంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆధ్వర్యంలో సాగుతున్న బైక్‌ర్యాలీ

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

బొబ్బిలి మున్సిపాలిటీలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆధ్వర్యంలో మంగళవారం బైక్‌ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని జయహో జగన్, జైజై శంబంగి అంటూ నినదించారు. బొబ్బిలిలో నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అంతకు ముందు పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ప్రజాప్రతినిధులు పరస్పరం నోరు తీపి చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కష్ణారావు, పార్టీ పట్టణ, మండలాధ్యక్షులు ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాలనాయు డు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వరరావు (విను), నాలుగు మండలాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



గజపతినగరంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, పార్టీ నాయకులు

చీరల పంపిణీ

సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పరిపాలన ఏర్పడి తొలి సంతకానికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా చీపురుపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో చీపురుపల్లిలోని పార్టీ కార్యాలయంలో వేడుకలు జరిపారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కేక్ కట్ అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం 500 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ పరిశీలకుడు కె.వి.సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



చీపురుపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు

జిల్లాలో తగ్గిన మాతా, శిశు మరణాలు

- డీఎంహెచ్ఓ డాక్టర్ రమణకుమారి



డీఎంహెచ్ఓ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో మాతాశిశు మరణాలు తగ్గాయని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో ఆమె మంగళవారం మాట్లాడారు. లక్ష ప్రసవాలకు 56 మాతృ మరణాలు, వెయ్యి మంది శిశువుల్లో 7 శిశు మరణాలు నమోదవుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం మాతా, శిశు ఆరోగ్య సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం కింద గ్రామాల్లో నివసించే గర్భిణులకు ప్రతినెలా వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఆరోగ్య జాగ్రత్తలు వివరిస్తున్నట్టు వెల్లడించారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ప్రసవా నికి వారం రోజుల ముందుగా నే ఆస్పత్రిలో చేర్పిస్తున్నామని తెలిపా రు. రక్తహీనత నివారణకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందన్నారు. గర్భిణులను సుఖప్రసవం కోసం 108 అంబులెన్సుల్లో ఉచితంగా ఆస్పత్రి చేర్చడంతో పాటు ప్రసవానంతరం తల్లీబిడ్డలను తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో సురక్షితంగా ఇంటికి చేర్చుతున్నామని చెప్పారు. పీహెచ్‌సీల్లో సైతం ప్రసవ సేవలు అందిస్తున్నామన్నారు. జిల్లాలో జామి, చల్లపేట, కొత్తవ లస, అలమండ, వియ్యంపేట, ఎల్.కోట పీహెచ్‌సీలకు నూతన భవనాలు నిర్మిస్తున్నామని, వాటి నిర్మాణం దాదాపు పూర్తికావచ్చిందన్నారు.

పెనుబాకలో సిరి సంబరం



పెనుబాకలో సిరిమానోత్సవ సందడి

రాజాం సిటీ: మంగళవాయిద్యాలు.. భక్తుల జయ జయ ధ్వానాల నడుమ సిరిమాను పూజారి రూపంలో గ్రామంలోకి తరలివచ్చిన అసిరితల్లికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించారు. 14 ఏళ్ల తర్వాత పెనుబాకలో జరిగిన సిరిమానోత్సవ సంబరం వైభవంగా సాగింది. వేలాదిమంది భక్తుల రాకతో గ్రామం రద్దీగా మారింది. తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న అసిరితల్లి పండగ మంగళవారంతో ముగిసింది. ఉదయం నుంచి అమ్మవారి ఘటాలతో మహిళలు ఊరేగింపు చేపట్టారు. సిరిమాను పూజారులు మామిడి చందు, చీడి కన్నంనాయుడు రెండు సిరిమానులను అధిరోహించగా తల్లి రథం, రెండు కొయ్యరథాలతో గ్రామంలో తిరువీధి నిర్వహించారు. సిరిమానోత్సవంలో చిన్నారుల కోలాటం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులకు ఇబ్బందులు కలగకుండా జెడ్పీటీసీ బండి నర్సింహులు, సర్పంచ్ బండి బోడెమ్మ, పోలీసులు, గ్రామ యువత ఏర్పాట్లు చేశారు.

జూలై 20 నుంచి అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

- ఏర్పాట్లపై సమీక్షించిన కలెక్టర్ నాగలక్ష్మి



అగ్నివీర్ ర్యాలీపై కలెక్టర్ నాగలక్ష్మితో చర్చిస్తున్న కల్నల్ వినయ్‌కుమార్

విజయనగరం అర్బన్: రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన నిరుద్యోగుల కోసం జూలై 20వ తేదీ నుంచి అగ్నివీర్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారి కల్నల్ వినయ్‌కుమార్ తెలిపారు. ఎంపిక రెండు దశల్లో జరుగుతుందన్నారు. మొదటి దశలో రాత పరీక్ష, ఇందులో ఉత్తీర్ణులైన వారికి రెండవ దశలో శారీరక సామర్థ్యం, వైద్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. రాత పరీక్ష ఇప్పటికే పూర్తయిందని, ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షలో 10 వేల మంది ఎంపికైనట్టు వెల్లడించారు. వీరికి శారీరక, వైద్య పరీక్షలు విజయనగరం పీటీసీ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తామని, దీనికి సహకరించాలని కలెక్టర్ నాగలక్ష్మిని కలెక్టరేట్‌లో మంగళవారం కలిసి విన్నవించారు. ర్యాలీకి అవసరమైన గ్రౌండ్, భద్రత, ట్రాన్స్‌పోర్ట్, భోజనాలు, తాగునీరు, సీసీ కెమెరాల అమరిక తదితర ఏర్పాట్లు చేయాలని కోరారు.

దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సంబంధిత అధికారులందరితో త్వరలోనే సమావేశం నిర్వహించి ఆయా శాఖలకు ఆర్మీ ఏర్పాట్లపై తగు ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. ర్యాలీలో పాల్గొనే అభ్యర్థులకు అడ్మిట్ కార్డ్స్ ఇవ్వాలని, డ్యూటీలో ఉన్న అధికారులకు ఐడీ కార్డులు అందజేయాలన్నారు. అక్షయపాత్ర స్వచ్ఛంద సంస్థ ద్వారా అభ్యర్థులకు, అధికారులకు అల్పాహారం అందిస్తామని చెప్పారు. జిల్లా యంత్రాంగం తరఫున పూర్తిస్థాయిలో సహకరిస్తామని స్పష్టంచేశారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, సహాయ కలెక్టర్ త్రివినాగ్, డీఆర్వో గణపతిరావు, సెట్విజ్ సీఈఓ, పోలీస్, ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ వాత్సల్యం

- ఫ్యామిలీ డాక్టర్‌పై గ్రామాలవారీగా షెడ్యూల్ ప్రకటించాలి
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: మిషన్ వాత్సల్య పథకం అర్హులందరికీ అందేలా చూడాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశించారు. సాంకేతిక కారణాలతో ఈ పథకం ఎవరికీ దూరం కాకూడదని స్పష్టం చేశారు. జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన 1, 2, 4, 7 స్థాయీ సంఘ సమావేశాలకు ఆయన అధ్యక్షత వహించారు. 3వ స్థాయీ సంఘ సమావేశానికి వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, 6వ స్థాయీ సంఘ సమావేశానికి వైస్ చైర్మన్ కొరగ్రన్ని సింహాచలం, 5వ స్థాయీ సంఘానికి ఆ సంఘం చైర్‌పర్సన్ బి.శాంతకుమారి అధ్యక్షత వహించారు. సమావేశంలో వ్యవసాయం, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమం, వైద్యారోగ్యం, గృహనిర్మాణం తదితర అంశాలపై చర్చించారు.

23,500 దరఖాస్తులు

మిషన్ వాత్సల్యా పథకానికి విజయనగరం జిల్లాలో 14,000, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి 9,500 మొత్తం 23,500 దరఖాస్తులు వచ్చాయని ఆయా జిల్లాల ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్లు తెలిపారు. కొన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను జత చేయకపోవడంతో కొన్నిదరఖాస్తులు తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉందన్నారు. దీనిపై జెడ్పీ చైర్మన్ స్పందిస్తూ అవసరమైన ధ్రువపత్రాలు జత చేసేందుకు దరఖాస్తుదారులకు మరో అవకాశం ఇవ్వాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను ఆయా మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సచివాలయాలకు అందించాలన్నారు. భర్త వదిలేసిన, విడాకులు తీసుకోని మహిళలకు వీఆర్వో లేదా ఇతర అధికారుల నుంచి తీసుకున్న ధ్రువీకరణ పత్రం దరఖాస్తుకు జతచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంతో పేదకుటుంబాల పిల్లలకు మేలు జరిగేలా చూడాలన్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంపై మరింత విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య శిబిరాల వివరాలను నెలరోజుల ముందుగానే తెలియజేయాలన్నారు. గ్రామంలోకి డాక్టర్ వస్తున్న విషయాన్ని గ్రామాల్లో దండోరా వేయించాలని, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంల ద్వారా తెలియజేయాలని సూచించారు. వ్యవసాయ పరికరాలను ఎక్కడ తక్కువ ధరకు లభిస్తే అక్కడే కొనుగోలుచేసుకునే అవకాశం రైతులకు కల్పించాలని చైర్మన్ కోరారు.

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలను హేతుబద్ధీకరించాలని, అవసరమైన చోట కొత్త సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. హాస్టళ్లలో మరుగుదొడ్లు, ప్రహరీలు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

క్లుప్తంగా

విజయగణపతికి ప్రత్యేక పూజలు



విజయగణపతికి అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో విజయగణపతికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హస్తా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు చాణక్య ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతభిషేకం, స్నపనం, అర్చన నిర్వహించారు. ఈ పూజల్లో ఎన్‌సీఎస్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, మేనేజర్లు రాజు, రమణ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సాలూరు వాసి ప్రతిభ



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజయమౌళి

సాలూరు: ఢిల్లీలో నిర్వహించిన సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ పోటీల్లో సాలూరు పట్టణానికి చెందిన యువకుడు బర్లి విజయమౌళి బంగారు పతకం సాధించాడు. ఈ నెల 28న నిర్వహించిన పోటీల్లో 66 కిలోల విభాగంలో 400 కిలోల బరువు ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా విజయమౌళిని కుటుంబసభ్యులు, బంధువులు, తదితరులు అభినందించారు.

145 మద్యం బాటిల్స్ సీజ్



సీజ్ చేసిన మద్యం బాటిల్స్‌తో ఎస్సై, సిబ్బంది

చీపురుపల్లి: అక్రమంగా రవాణా చేస్తున్న 145 మద్యం బాటిల్స్‌తో పాటు రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎ.సన్యాశి నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం నిర్వహించిన దాడుల్లో మండలంలోని కరకాం గ్రామానికి చెందిన పొన్నాడ పాపారావు 145 మద్యం బాటిల్స్ రవాణా చేస్తూ పట్టుబడడంతో బాటిల్స్ సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. మద్యం అక్రమ రవాణా చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో అనుమతి లేని బెల్టు దుకాణాలు నిర్వహిస్తే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న వీరభద్ర

పార్వతీపురం: పట్టణంలోని కొత్తపోలమ్మ కాలనీకి చెందిన ఎం.వీరభద్ర రిలయన్స్ స్మార్ట్ బజార్‌కు వెళ్లి వస్తుండగా లస్సీ షాపు వద్ద మంగళవారం గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో తల వెనుక భాగంతో పాటు కాలి చిటికిన వేలుకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పార్వతీపురం ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 505.00
విజయనగరం	రూ. 509.00
శ్రీకాకుళం	రూ. 509.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	60,490-00
బంగారం(22కి. 10గ్రా.)	55,450-00
వెండి (కిలో)	72,600-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రస్డ్	స్కిన్‌లెస్
₹154	₹278	₹ 288

ప్రాణంపై పొగ ఎందుకు?

పొగ తాగని వాడు దున్నపోతై పుట్టున్ అంటాడు కన్యాశుల్కంలో గిరీశం పాత్రధారి. పొగ తాగేవారు తమను తాము సమర్థించు కోవడానికి వాడే మాట ఇది. నిజానికి పొగ తాగడం అంటే జీవితానికి పొగ పెట్టు కోవడమే. ఊపిరితిత్తులు, గుండె, రక్త నాళాలను దెబ్బతీస్తూ గుండె జబ్బులు, పక్షవాతం వంటి సమస్యలను ధూమపానం తెచ్చిపెడుతుంది. రకరకాల కేన్సర్లకూ కారణమవుతుంది. పొగాకు వినియోగానికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. నేడు పొగాకు వ్యతిరేక దినోత్సవం.



- ధూమపానంతో కేన్సర్, పలు రకాల వ్యాధులు
- పొగాకు ఉత్పతులకు దూరంగా ఉండాలని వైద్యుల హితవు

విజయనగరం ఫోర్ట్: ధూమపానం కారణంగా గుండెపోటు, కేన్సర్, వంటి ప్రాణాంతక వ్యాధులు బారిన పడిన వారి సంఖ్య జిల్లాలో రోజురోజుకు పెరుగుతోంది. గుండెపోటుకు గురైన ప్రతి ముగ్గురిలో ఒకరు ధూమపానం కారణంగానే ప్రమాదకర పరిస్థితికి గురవుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. మధుమేహ వ్యాధి అదుపులో లేకపోవడంతో ఆ ప్రభావం కిడ్నీలు, లివర్, కళ్లు వంటి కీలక అవయవాలపై పడుతోంది. సిగరెట్, చుట్ట తాగడం ఫ్యాషన్‌గా మారిపోతోంది. ఒకరిని చూసి మరొకరు సిగరెట్, చుట్ట తాగడం అలవాటు చేసుకుంటున్నారు. అదేవిధంగా ఖైనీ, గుట్కా వంటి పొగాకు ఉత్పత్తులను జనం ఎక్కువగా వినియోగిస్తున్నారు. రోజురోజుకు పొగతాగే వారి సంఖ్య పెరుగుతోంది. జిల్లాలో పొగతాగే వారి సంఖ్య 60 శాతం వరకు ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఒక సిగరెట్ నిమిషం జీవితకాలాన్ని తగ్గించేస్తుందన్న విషయాన్ని గ్రహించలేకపోతున్నారు. సిగరెట్ తాగిన వారితో పాటు ఆపొగను పీల్చిన వారు సైతం వ్యాధుల బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. గతంలో నిరక్షరాస్యులు, గ్రామీణ ప్రాంత వాసులు ఎక్కువగా సిగరెట్, చుట్ట తాగేవారు. కానీ నేడు పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రతి ఒక్కరు పొగతాగుతున్నారు. యువత కూడా సిగరెట్ తాగడం ఫ్యాషన్‌గా భావిస్తూ అలవాటు పడడం ఆందోళన కలిగిస్తున్న అంశం. పొగ తాగడం వల్ల అనేక వ్యాధులు వ్యాప్తి చెందుతాయని తెలిసినప్పటికీ అలవాటు పడిన వారిలో మార్పు రావడం లేదు. పొగతాగుతున్న వారిలో 8 శాతం యువత ఉండడం గమనార్హం. పొగతాగుతూ వారు అనారోగ్యం బారినపడడమే కాకుండా చుట్టు పక్కల ఉన్న వారిని కూడా అనారోగ్యం పాలుజేస్తున్నారు.



నోటి కేన్సర్ సోకిన వ్యక్తి

పొగతాగడం వల్ల ప్రాణాంతక వ్యాధులు

సిగరెట్, చుట్ట తాగడం వల్ల ప్రాణాంతకమైన కేన్సర్ వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. పొగ తాగడం వల్ల గొంతు, ఊపిరితిత్తుల కేన్సర్, నోటి కేన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. వాటితో పాటు క్రానిక్ బ్రాంకైటిస్ వ్యాప్తి చెందే అవకాశం ఉంది. పొగ తాగడం వల్ల న్యుమోనియా అధికమవుతుంది. ఇన్‌ఫెక్షన్స్ అధికమవుతాయి. సీఓపీడీ వ్యాధి వచ్చే అవకాశం ఉంది.

కేన్సర్, బ్రాంకైటిస్ బారిన పడి మృత్యువాత

కేన్సర్ ముదిరిపోయినంత వరకు గుర్తించ లేకపోవడం వల్ల మృత్యువాత పడుతున్నారు. కేన్సర్‌ను ప్రారంభదశలో గుర్తిస్తే కొంతవరకు ప్రయోజనం ఉంటుంది. కానీ ముదిరితే మరణమే తప్పదు.

ధూమపానంతో జిల్లాలో రోగుల వివరాలు ఏడాదికి (అంచనా)	
గుండెజబ్బు	15వేలు
బ్రెయిన్‌స్ట్రోక్	6 వేలు
సుగర్ అదుపులోలేకపోవడం	15 వేలు
కేన్సర్	2వేలు
మానసిక రుగ్మతలు	5 వేలు

ఏడాదికిరూ.1.40 కోట్లు:

అన్ని రకాల వర్గాల వారికి సిగరెట్లు, చుట్టలు అంటుబాటులో ఉన్నాయి. ఏడాదికి రూ.1.40 కోట్ల వరకు సిగరెట్లు, చుట్టల కోసం ఖర్చు చేస్తున్నారు. సామాన్య ప్రజలు చుట్టలు, తక్కువ రకం సిగరెట్లు తాగుతున్నారు. సంపన్నవర్గాల వారు ఖరీదైన సిగరెట్లు తాగుతున్నారు .

పొగ తాగితే జీవితకాలం తగ్గినట్లే



పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. సిగరెట్లు తాగడం జీవితకాలం తగ్గిపోతుంది. పొగాకు తాగే వారి కుటుంబంలో పిల్లలు ఉంటే వారి మెదడుపై ప్రభావం ఉంటుంది. పొగ తాగడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తుల కేన్సర్, నోటి కేన్సర్, సీఓపీడీ వ్యాధులు వచ్చే ఆస్కారం ఉంది. డాక్టర్ బొత్స సంతోష్, డిప్యూటీ సూపరింటెండెంట్, పలమనాలజిస్టు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

ప్రభుత్వ మద్యం షాపులో చోరీ



మద్యం షాపులో సిబ్బందిని ప్రశ్నిస్తున్న ఎస్సై ముకుందరావు,ఏఎస్సై యువరాజు

లక్కవరపుకోట: మండలంలోని లచ్చింపేట గ్రామం సమీపంలో గల ప్రభుత్వ మద్యం షాపులో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ లక్షా,32వేలు నగదు దోచుకుపోయారు. ఈ చోరీకి సబంధించి ఎస్సై ఎస్.ముకుందరావు, మద్యం షాపు సూపర్‌వైజర్ మహలక్ష్మినాయుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం మద్యం విక్రయించిన సొమ్మును ఎప్పటిలాగానే షాపులో గల లాకర్‌లో పెట్టి విధులు ముగించుకుని షాపులో పనిచేస్తున్న సూపర్‌వైజర్, సేల్స్‌మన్‌లు వెళ్లిపోయారు. రాత్రి కాపలా దారులకు షాపును అప్పజెప్పి జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పారు. కాగా మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి షాపు వెనుక భాగంలో ఇనుప రేకును వంచి లోనికి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించినట్లు సిబ్బంది తెలుసుకుని లాకర్‌లో గల రూ,లక్షా,32వేలు దోచుకుపోయినట్లు గుర్తించారు. అయితే లాకర్ తాళాలు సక్రమంగా వేయలేదని ఈ పని ఇంటి దొంగలే చేసినట్లు అనుమానిస్తున్నామని ఎస్సై ముకుందరావు తెలిపారు.ఈ మేరకు సూపర్‌వైజర్ మహలక్ష్మినాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఉపాధి వేతనదారు మృతి



మృతి చెందిన ఈదల సీతయ్య

కొమరాడ: మండలంలోని కోటిపాం పంచాయతీ గుంపగదబవలస గ్రామనికి చెందిన ఉపాధి వేతనదారు ఈదల సీతయ్య(56)సోమవారం ఉపాధి పని ముగించుకుని ఇంటికి వెళ్లిన వెంటనే సొమ్మసిల్లి పడిపోయాడు. దీంతో గ్రామస్తులు, భార్య లక్ష్మి 108 వాహనంలో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్తులు కొంత మొత్తం పోగు చేసి మృతదేహాన్ని గ్రామనికి తీసుకువచ్చి దహన సంస్కారాలు చేశారు. మృతుడి కుటుంబాన్ని అధికారులు ఆదుకోవాలని సీపీఎం నాయకుడు కొల్లి సాంబమూర్తి కోరారు. దీనికి సంబంధించి ఉపాధి హామీ ఏపీఓ బాలకృష్ణను వివరణ కోరగా క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.



లక్ష్మణరావు మృతదేహం

బొలెరో ఢీకొని వృద్ధుడు..

రాజాం సిటీ: స్థానిక మెయిన్ రోడ్డులో బొలెరో వాహనం ఢీకొని గడ్డవీధికి చెందిన చీడి లక్ష్మణరావు (65) మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. పూల కొట్టులో పనిచేస్తున్న లక్ష్మణరావు రోజులాగానే పని చేసేందుకు మంగళవారం వేకువజామున నడుచుకుంటూ వస్తున్నాడు. ఆర్టీసీ ఔట్‌గేటు వద్ద రోడ్డు దాటుతుండగా వేగంగా వస్తున్న బొలెరో వ్యాన్ ఢీకొనడంతో రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రాజాం సామాజిక ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని తమ్ముడు గురుమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వైభవంగా సూర్యనారాయణ మూర్తి స్వామి కల్యాణం



సూర్యనారాయణస్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం గ్రామంలో గల శ్రీ సూర్యనారాయణమూర్తి స్వామి ఆలయంలో ఉషా, ఛాయాదేవి సమేత సూర్యనారాయణ మూర్తి, ఉమా సోమలింగేశ్వరస్వామి కల్యాణాలను ఆలయ ఆనువంశిక ధర్మకర్త, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి. రమణరాజు దంపతులు, అయన సోదరుల దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి సంబంధించిన ప్రత్యేకపూజలు వేకువజామునుంచి మొదలు పెట్టారు. ఈ కల్యాణానికి గ్రామానికి చెందిన పలువురు భక్తులు, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కల్యాణ వేడుక భక్తులను అద్యంతం ఆకట్టుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

మాదకద్రవ్యాల రవాణా నేరం



వాహనాల్లో సోదాలు చేస్తున్న ఎస్‌ఈబీ సీఐ జైభీమ్

బొబ్బిలి: మాదకద్రవ్యాల రవాణా నేరమని, వాటిని కలిగి ఉన్నా, తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఈబీ సీఐ ఆర్.జైభీమ్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పాతబొబ్బిలి, రైల్వేస్టేషన్, ఆర్‌టీసీ కాంప్లెక్స్ ప్రాంతాల్లో మంగళవారం తనిఖీలు చేపట్టిన ఆయన ప్రయాణికుల లగేజీలను తనిఖీ చేయడంతో పాటు రామభద్రపురం, రాయగడ రోడ్డులో వెళ్లే వాహనాల్లో సోదాలు చేపట్టారు. గంజాయి రవాణా జరుగుతోందన్న ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

పైడితల్లికి పుష్పాలంకరణ



ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారికి మిఠాయిల నైవేద్యం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలను తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమానుపూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు, దూసి శివప్రసాద్‌లు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. తీపి పదార్థాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప,రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మూడు లారీలు సీజ్



గ్రావెల్ తరలిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మైన్స్ అధికారులు

బొండపల్లి: మండలంలోని అంబటివలస గ్రామాన్ని ఆనుకునిఉన్న కొండ లోని కొంతభాగంలో గ్రావెల్‌ను అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తుండగా మైన్స్ అధికారులు మూడు లారీలను సీజ్ చేసి డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా మైన్స్ ఎ.డి ఎస్పీకే మల్లేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో కొంతకాలంగా ప్రభుత్వానికి చెందిన కొండతో పాటు చుట్టుపక్కల గల ప్రభుత్వ డీ పట్టా భూముల్లో కూడా అక్రమంగా గ్రావెల్‌ను రాత్రి పూట తరలిస్తున్నట్లు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఈ మేరకు గ్రామంలో సోమవారం అర్ధరాత్రి మూడు లారీలతో పాటు, ఒక జేసీబీతో అక్రమంగా గ్రావెల్‌ను తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు కొండ ప్రాంతాన్ని పరిశీలించి మూడు లారీలు, జేసీబీని అదుపులోకి తీసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. తదుపరి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోనున్నామన్నారు. ఈ వ్యవహారంలో మైన్స్ శాఖలోనే పని చేస్తున్న ఉద్యోగితో పాటు, గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి పాత్ర ఉన్నట్లుగా గుర్తించామని చెప్పారు. సీజ్ చేసిన లారీల డ్రైవర్లు ఈ విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేశారని వివరించారు.

జగన్ అంటే నమ్మకం..

చంద్రబాబు ఒక అబద్ధం

- నాలుగేళ్లలో 98.5 శాతం హామీలు అమలు చేసిన సీఎం జగన్
- ప్రతిపక్ష నేతపై ప్రజల్లో లేని విశ్వసనీయత
- అధికారం కోసం ఆల్ ఫ్రీ బాబుగా మార్పు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



విలేకరులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: ప్రజల కోసం మాట ఇస్తే ఎన్ని కష్టాలు ఎదురైనా నిలబెట్టుకుంటాడనే నమ్మకం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు ఉంటే..మాట చెబితే అది అబద్ధమే తప్ప ఎన్నటికీ ఆచరణలోకి రాదనే అభిప్రాయం ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడిపై ప్రజలకు ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు చీపురుపల్లి పట్టణంలోని లావేరురోడ్‌లో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి 2019 మే 30న నవరత్నాలు సంక్షేమ పథకాల ఫైలుపై తొలి సంతకం చేశారని, నాలుగేళ్లుగా సంక్షేమ పాలన దిగ్విజయంగా కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. 2019 ఎన్నికల్లో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతో రాష్ట్రంలో 151 అసెంబ్లీ స్థానాలు, విజయనగరం జిల్లాలో 9 అసెంబ్లీ, 3 పార్లమెంటు స్థానాల్లో ప్రజలు గెలిపించారన్నారు. అదే నమ్మకంతో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం ప్రజల కోసమే ఆలోచిస్తున్నారని చెప్పారు. సంక్షేమం, పెట్టుబడులు, ఉపాధి కల్పన, సాగునీటి వనరులు, మౌలిక వసతులు అభివృద్ధితో బాటు పేదలు అభ్యున్నతి కోసం కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. పేదలకు సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా ఫ్యామిలీ డాక్టర్ పేరుతో నేరుగా ఇంటికే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలు నివసిస్తున్న ప్రాంతంలోనే అన్ని సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, మూలపేట పోర్టు నిర్మాణానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారని మరో మూడేళ్లలో వాటి సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. విశాఖపట్నంలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాటు చేసి రూ.13.5 లక్షలు కోట్లు పెట్టుబడులను ఆకర్షించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అవినీతి రహిత, పారదర్శక పరిపాలనకు ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా డీబీటీ విధానం ద్వారా 2.5 లక్షల కుటుంబాల ఖాతాల్లో సంక్షేమ పథకాల డబ్బులు జమ చేయడం నిదర్శనంగా నిలుస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకుల త్యాగాలతో 2024లో 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని మళ్లీ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లు..

పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్న చందంగా చంద్రబాబు పరిస్థితి తయారైందని ఎద్దేవా చేశారు. నాలుగేళ్లుగా ఒక్క రూపాయి అవినీతి లేకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తుంటే విమర్శలు చేసిన చంద్రబాబునాయుడు అధికార దాహంతో టీడీపీ మహానాడులో అన్నీ ఉచితమే అంటూ ఆల్ ఫ్రీ బాబుగా మారిపోయాడన్నారు. చంద్రబాబు అబద్ధపు హామీలపై ఇటు ప్రజలు, అటు సొంత పార్టీ నేతలతో బాటు సోషల్ మీడియాలో తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోందని స్పష్టం చేశారు. 2019 నుంచి ఇంతవరకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కులం, పార్టీ, మతం, జెండా చూడకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకం అందించారని, ఈ విషయంలో టీడీపీ కార్యకర్తలు గుండెలపై చేయి వేసుకుని నిర్ధారణ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలాస నియోకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు కేవీ.సూర్యనారాయణరాజు, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, చీపురుపల్లి, మెరకముడిదాం, గుర్ల మండలాల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, కోట్ల వెంకటరావు, తాడ్డి వేణు, పొట్నూరు సన్యాసప్పలనాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, పతివాడ రాజారావు, కరిమజ్జి శ్రీనివాసరావు, ఇప్పిలి గోవింద, బాణాన శ్రీనివాసరావు, బాణాన రమణ తదితరులు పాల్గొన్నారు.